క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి : చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. నిరూప్‌నగర్ తండా నుంచి కోమటిపల్లి రైల్వేగేట్ ఉనికిచర్ల అండర్ బ్రిడ్జి ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విని యోగదారులు సహకరించాలని కోరారు.

నేడు భూమి పూజ

హసన్‌పర్తి : మండల కేంద్రంలోని ఆర్టీసీ కాలనీలో చేపట్టిన శ్రీ సీతారామ మందిర నిర్మాణానికి బుధవారం ఉదయం 7.23 గంటలకు భూమి పూజ చేయనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అరూరి రమేష్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు శ్రీరామ సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ కమిటీ తెలిపింది. భక్తుల అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

'శ్వేతార్క'లో పూజలు

కాజీపేట: కాజీపేట స్వయంభు శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. వేసవి ఎండల తీవ్రత తగ్గి వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ ఆదిమూల గణపతి, యోగాంజనేయస్వామి దేవతామూర్తులకు 108 కిలోల వెన్న, 28 లీటర్ల పానకంతో 108 సార్లు మన్యు సూక్త విధానంతో అభిషేకం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు అనంతమల్లయ్య శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఎస్సీ సెల్ డిపార్ట్‌మెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కిరణ్

హసన్‌పర్తి: కాంగ్రెస్ ఎస్సీ సెల్ డిపార్ట్‌మెంట్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హసన్‌పర్తికి చెందిన గొర్రె కిరణ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల రామకృష్ణ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో కిరణ్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ పదవిలో నియమించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కాజీపేట: నగరంలోని 63వ డివిజన్ విజయనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పార్క్ అభివృద్ధి పనులను మంగళవారం కార్పొరేటర్ విజయశ్రీ ప్రారంభించారు. పార్క్ స్థలంలో వేసిన బోరును ఆమె లాంఛనంగా ప్రారంభించి కాలనీవాసులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సయ్యద్ రజాలీ, నర్సింగ్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్ ఇతర బాధ్యులతో కలిసి మంగళవారం హనుమకొండ డీఈఓ కార్యాలయంలో ఏసీజీ చలపతిరావుకు వినతిపత్రం సమర్పించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, జిల్లా సమితి బాధ్యులు భాను, దీప్తిలు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

విద్యారణ్యపురి : ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం వంటచేసే ఏజెన్సీలకు చెల్లించాల్సిన కోడిగుడ్ల బకాయిలను వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.రఘుపతి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో కొత్తమెనూను అమలు చేయాలని నిర్ణయించింది కానీ గత సంవత్సరానికి సంబంధించిన బకాయిలు చెల్లించలేదన్నారు.

నేడు కమర్షియల్ షట్టర్లకు వేలం

వరంగల్ : వరంగల్ లక్ష్మీపురం మోడల్ మార్కెట్‌లోని కమర్షియల్ షాపులకు వేలం నిర్వహించనున్నట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. గత ఏడాది 30 కమర్షియల్ షాపులకు వేలం వేయగా అందులో కొంత మంది అద్దెలు సరిగా కట్టకపోవడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు. అందులో కొన్ని కోర్టు కేసుల్లో ఉండగా 7 షాపులకు బుధవారం వేలం వేయనున్నట్లు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 161 మంది గైర్హాజర్

కాశోజీ సెంటర్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 161 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కాక మాధవరావు తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్లో మొత్తం 1,590 మంది అభ్యర్థులకుగాను.. 1,457 మంది హాజరయ్యారని తెలిపారు. సెకండియర్ పరీక్షల్లో 368 మంది విద్యార్థులకు 340 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- వర్ధన్నపేట ఎమ్మెల్యే రమేశ్

కరీమాబాద్ : మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. మామునూరు హెచ్‌ఆర్‌ఎస్ ఫంక్షన్‌హాల్ మంగళవారం జరిగిన మహిళా సంక్షేమ దినోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఆడబిడ్డల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. దశాబ్ది సుపరిపాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన రూ.12 కోట్ల 38 లక్షల 86 వేలు, శ్రీనిధి ద్వారా మంజూరైన రూ.1 కోటి 88 లక్షల 64 వేలకు సంబంధించిన చెక్కులను సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ మేయర్ గుండు సుధారాణి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, డీసీపీ పుల్లా కరుణాకర్, జిల్లా రైతుబంధు అధ్యక్షురాలు లలితాయాదవ్, సీడీపీఓ శ్రీదేవి, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రత్యేక పథకాలు

మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఉర్సుగుట్ట ఆకుతోట కన్వెన్షన్ హాల్‌లో మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదర్శవంతమైన పథకాలు తెచ్చారని చెప్పారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, డిప్యూటీ మేయర్ రిజ్వాని షమీమ్, ఆర్డీఓ మహేందర్‌జీ, డిడబ్ల్యూఓ శారద, మెప్మా పీడీ రేణుక, డీఎస్‌ఓ ఇందిర, సిడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ, సీడీపీఓ విశ్వజ, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, కావేటి కవిత, బోగి సువర్ణ, బస్వరాజు శిరీష, గుండు చందన, ముష్కమల్ల అరుణ, పోశాల పద్మ, ఓని స్వర్ణలత పాల్గొన్నారు.



కరీమాబాద్: మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్



కరీమాబాద్ : ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న తూర్పు ఎమ్మెల్యే నరేందర్

హన్మకొండ : మహిళా సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాటు పడుతుందని భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న మహిళా సంక్షేమ దినోత్సవాన్ని 58వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్మడి లోహిత ఆధ్వర్యంలో ఎన్జీవోస్ కాలనీలో జరుపుకున్నారు. డివిజన్‌లో పని చేసే మహిళా పారిశుద్ధ్య కార్మికులను కార్పొరేటర్, విజయ్ భాస్కర్ సన్మానించారు. బీఆర్‌ఎస్ 58వ డివిజన్ మహిళ అధ్యక్షురాలు జన్ను విజయలక్ష్మి, నాయకులు ఇమ్మడి రాజు, మధు, కిషోర్, మహేందర్, రవి, రమేష్, వేణు, చంద్రమౌళి గౌడ్ పాల్గొన్నారు.



హన్మకొండ: పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న విజయ్ భాస్కర్

ఆకట్టుకుంటున్న పరిణయ వస్త్ర ప్రదర్శన

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని అశోకా హోటల్‌లో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శన యువతులు, మహిళలను ఆకట్టుకుంటుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల చేనేతకారులు, డిజైనర్ల ఆధ్వర్యంలో జరుగుతున్న వస్త్ర ప్రదర్శనలో ఆధునిక డిజైన్లను చూసిన వారు కొలువుదీరిన వస్త్రాలు భారతీయ సాంప్రదాయం ప్రతిబింబించేలా ఎంతో అందంగా ఉన్నాయన్నారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ధరించడానికి అనుగుణంగా ప్రత్యేక కలెక్షన్స్ మగువల మనసు దోచేవిధంగా ఉన్నాయని అన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు టీవీ రావు మాట్లాడుతు వివాహ, పండుగలతో పాటు ఇతర ప్రత్యేక సందర్భాల్లో ధరించే విధంగా దేశంలో పేరుగాంచిన వివిధ రకాల వస్త్రాలైన ఉప్పాడ, కలంకారీ, మంగళగిరి, ప్రింట్, సిల్క్, కాటన్ చీరలు, కశ్మీర్ సిల్క్ బ్లౌజులు, టాప్స్ వన్‌గ్రాం గోల్డ్ జువెల్లరీ లభిస్తాయన్నారు. ఈ వస్త్ర ప్రదర్శన జూన్ 14తో ముగుస్తుందని పేర్కొన్నారు. వివరాలకు 94411 83981 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.



ఎగ్జిబిషన్‌లో షాపింగ్ చేస్తున్న మహిళలు

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

న్యూశాయంపేట : ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టి, ఫీజు నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వేల్పుల ప్రసన్నకుమార్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. మంగళవారం హనమకొండ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాశాఖ నిబంధనను తుంగలో తొక్కి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తూ వారి రక్త మాంసాలతో వ్యాపారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. రవితేజ, తదితర నాయకులు పాల్గొన్నారు.

భద్రకాళి చెరువు శిఖం కబ్జా అవాస్తవం

హన్మకొండ చౌరస్తా : భద్రకాళి చెరువు శిఖం కబ్జా చేస్తున్నారని కొందరు చే స్తు న్న ఆరోపణలు అవాస్తవమని భూ యజమానులుగా చెప్పుకుంటున్న హనుమకొండకు చెందిన అడ్లూరి రామకృష్ణ, యాకూబ్‌రెడ్డి, శోభనబోయిన ప్రభాకర్, నీలేశ్వర్ సింగ్, నారాయణసింగ్ అన్నారు. మంగళవారం హనుమకొండ పద్మాక్షికాలనీ వైపు భద్రకాళి చెరువు శిఖం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. తాతల నుంచి వస్తున్న వ్యవసాయ భూములని, దీనికి సంబంధించిన పట్టా పాస్‌పుస్తకాలు, పత్రాలను చూపించారు. చెరువు పారకం భూములైన సర్వే నంబర్ సర్వే నెంబర్ 864, 865, 872,873, 874, 875, 911, 912,913, 914 లలో సుమారు 18 ఎకరాల భూమి వారసత్వంగా వస్తుందన్నారు. సిద్దసముద్రం మాయం కావడంతో వ్యవసాయం ఆగిపోయిందని, 1997 అప్పటి మున్సిపల్ కమిషనర్ అరవింద్‌కుమార్ భద్రకాళి స్మాల్ బండ్ నిర్మాణం కోసం చెరువు నీరు రాకుండా చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అది ఇప్పటి వరకు సాధ్యపడకపోవడంతో హైకోర్టులో పిటిషన్ వేసి న్యాయస్థానంలో మేమే గెలిచామన్నారు.



భూమి పత్రాలను చూపెడుతున్న భూ యజమానులు

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కరీమాబాద్ : గ్రేటర్ పరిధిలోని 42వ డివిజన్ గవిచర్ల క్రాస్‌రోడ్ నుంచి రంగశాయిపేట ఉర్సురోడ్ వరకు వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ గుండు చందన సూచించారు. ఎల్లమ్మగుడి ప్రాంతంలో చేపట్టిన రోడ్డు పనులను పరిశీలించారు.

పుస్తకాల పంపిణీ

కాజీపేట: నగరంలోని 61వ డివిజన్ ఆర్‌ఈసీ తండా ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం కార్పొరేటర్ ఎలకంటి రాములు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కేవీలో అబ్బురపరిచిన 'నిపుణ్‌భారత్'



కాజీపేట అర్బన్ : మండలంలోని కడిపికొండ కేంద్రీయ విద్యాలయలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్‌భాగీదారిలో భాగంగా ఏర్పాటు చేసిన నిపుణ్‌భారత్ కార్యక్రమం అబ్బురపరించింది. విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరికల్ అంశంపై ఆడియో విజ్యువల్స్‌తో అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో ఆడియో విజువల్స్ ద్వారా వివిధ రకాల ఆకృతులు, అక్షరాలు, నంబర్లు, ఇంగిలీష్ వర్డ్స్, జంతువుల పేర్లు తదితర వాటిపై వివరించారు.

రెగ్యులరైజ్ చేయాలని చీఫ్‌విప్‌కు వినతి

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ బాధ్యులు మంగళవారం హనుమకొండలో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ స్పందిస్తూ మీ రెగ్యులరైజేషన్ విషయంలో లెటర్ రాస్తానని తెలిపారని ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ తెలిపారు.



ఎమ్మెల్యేకు వినతి

రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ చైర్మన్ డాక్టర్ పి.కరుణాకర్‌రావు, కన్వీనర్ డాక్టర్ సాదు రాజేష్ ఇతర బాధ్యులు కలిసి మంగళవారం వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బాధ్యులు డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ ఫిరోజ్‌పాషా, తదితరులు ఉన్నారు.

'ఏవీవీ'లో ఇంగ్లిష్ మీడియం ప్రారంభం

రామన్నపేట : నగరంలోని ఏవీవీ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం (2023–24) నుంచి ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు ప్రభుత్వ అనుమతి లభించిందని విద్యా సంస్థ కార్యదర్శి వద్దిరాజు వెంకటేశ్వరరావు, శాశ్వత సభ్యుడు చందా శ్రీకాంత్‌లు తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు బాలబాలికల తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

ఖిలా వరంగల్: మహిళా రేజర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని పీవైఎల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బండి కోటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం శంభునిపేటలోని గవిచర్ల జంక్షన్‌లో ప్రగతిశీల యువజన సంఘం, న్యూడెమోక్రసీ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

యువకుడి అదృశ్యం

కాశిబుగ్గ : ఓ యువకుడు అదృశ్యమైన ఘటన ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. వారు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం సూర్యపేట తండాకు చెందిన ధరావత్ బిక్కు కుమారుడు వెంకటేష్(22) గత నాలుగు నెలలు నుంచి డిప్రెషన్‌కు లోనై బాధపడుతున్నాడు. హస్పిటల్‌లో చూపించుటకు తల్లితండ్రులతో కలిసి గత ఆదివారం హనుమకొండకు వచ్చాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు వరంగల్ బస్టాండ్‌కు చేరుకుని బస్సు ఎక్కుతుండగా వెంకటేష్ కనిపించకుండా పోయాడని తెలిపారు. చుట్టుపక్కల వెతికినా అతని ఆచూకీ లభ్యం కాలేదు. తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ తెలిపారు.

యువతి అదృశ్యం

ఓ యువతి అదృశ్యమైన ఘటన పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. వారి కథనం ప్రకారం వరంగల్ జిల్లా దుగ్గొండికి చెందిన అడ్డ కవిత, బాబు దంపతుల కూతురు రుచిత (17) సోమవారం అమ్మమ్మ ఇళ్లు కాశిబుగ్గ వివేకానందకాలనీలో అమ్మమ్మ లేని సమయంలో ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ లభ్యం కాకపోవడంతో యువతి తల్లి కవిత పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

కరీమాబాద్: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ప్రభుత్వమే నాణ్యమైన విత్తనాలు 70 శాతం సబ్సిడీపై అందించడమే కాకుండా కల్తీ క్రిమిసంహారక మందులను అరికట్టి పంటల బీమా పథకం అమలు చేయాలని మంగళవారం కోరారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు. పంటల దిగుబడిలో విత్తనాలదే ప్రధానపాత్ర అని పేర్కొంటూ జిల్లాలో రోజురోజుకు కల్తీ విత్తనాల దందా పెరిగిపోయిందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాచర్ల బాలరాజు, ఆరెల్లి కృష్ణ, గట్టి కృష్ణ, ఇనుముల కృష్ణ, గంద్రతి హరిబాబు, జన్నారపు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'సిగ్మా'లో రక్తదాన శిబిరం



హన్మకొండ : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హనుమకొండలోని జిల్లా బస్‌స్టేషన్ కూడలిలోని సిగ్మా ఆస్పత్రిలో యా బ్లడ్ యాప్, సంజీవని బ్లడ్ బ్యాంక్, సిగ్మా ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఉద్దేశించి డాక్టర్ బింగి శ్రీనివాస్, డాక్టర్ బింగి విద్యా స్రవంతి మాట్లాడుతూ శస్త్ర చికిత్స, ప్రమాదం జరిగిన సమయాల్లో రక్తం అందుబాటులో లేక మరణాలు సంభవిస్తున్నాయన్నారు. యా బ్లడ్ యాప్ కమ్యూనికేషన్ మేనేజర్ శంకర్, డాక్టర్ మంచికట్ల జనార్దన్, ప్రొఫెసర్ చింతకింది శ్రీనివాస్, రక్త దాతలు పిట్టల కళ్యాణ్, రాజశేఖర్, నితిన్, సాయి, సాయిరాం, సాల్మ, కవిత, పాల్గొన్నారు.

పేదల గుడిసెలు కూల్చడం అన్యాయం

న్యూశాయంపేట : మహబూబాబాద్ కలెక్టరేట్ సమీపంలో ఇళ్లులేని పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటుంటే వాటిని అధికారులు కూల్చడం అన్యాయమని హన్మకొండ సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ బి.చక్రపాణి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుడిసెలను కూల్చివేసి పేదలపై లాఠీచార్జి చేయడానికి సీపీఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఓ పక్క జీఓ నంబర్ 58 ప్రకారం దరఖాస్తు చేసుకోమని చెబుతూనే మరోపక్క పేదల గుడిసెలు తొలగించడం రెండు నాల్కల ధోరణికి అద్దం పడుతుందని ఆరోపించారు. గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని లేనిఎడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.సమావేశంలో నాయకులు ఎస్.వాసుదేవరెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, జి.వెంకట్, సంపత్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చక్రపాణి

గుర్తింపులేని పాఠశాలలను మూసివేయాలి

విద్యారణ్యపురి: గుర్తింపు లేని ప్లే స్కూల్స్‌ను, అలాగే ప్రాథమిక, హైస్కూల్స్‌ను మూసివేయించాలని హనుమకొండ డిస్ట్రిక్ట్ అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (హడుప్సా) అధ్యక్షుడు వర్ధమాను జనార్దన్, జనరల్ సెక్రటరీ పి వెంకటరమణ, ఇతర బాధ్యులు మంగళవారం హనుమకొండ డీఈఓ ఎండీ. అబ్దుల్‌హైని కలిసి వినతిపత్రంను సమర్పించారు. కార్పొరేట్ స్కూల్స్ వివిధ బ్రాంచీలు ఓపెన్ చేసి తప్పుడు ఫలితాలను చూపిస్తూ తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్నాయని అలాంటి కార్పొరేట్ స్కూల్స్‌ను నియంత్రించాలని వారు డీఈఓను కోరారు. గుర్తింపులేని ప్లేస్కూల్స్, కార్పొరేట్ పాఠశాలల ప్రభావం బడ్జెట్ పాఠశాలలపై పడుతుందని దీంతో బడ్జెట్ పాఠశాలలకు సహకరించాలని వారు డీఈఓకు విన్నవించి వినతిపత్రంను సమర్పించారు. స్పందించిన ఆయన ఓ కమిటీ వేసి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు హడుప్సా బాధ్యులు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో హడుప్సా అడ్వైజర్ టి.బుచ్చిబాబరావు, కోశాధికారి డి శంకర్, ఉపాధ్యక్షుడు టి.రాజేశ్వర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.సంతోష్‌రెడ్డి, అకాడమిక్ కన్వీనర్ బి.వెంకటరెడ్డి ఉన్నారు.



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న హడుప్సా అధ్యక్షుడు, ఇతర బాధ్యులు

'ఆలయ భూముల జోలికొస్తే ఊరుకోం'

నయీంనగర్: ఎట్టి పరిస్థితుల్లో దాసాంజనేయ హనుమాన్ దేవాలయ భూములను కాపాడుకుంటామని ఆలయ భూముల జోలికొస్తే ఊరుకోమని హన్మకొండ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. మంగళవారం హన్మకొండ డబ్బాల జంక్షన్ దాసాంజనేయ స్వామి ప్రాంగణంలో హనుమాన్ ఆలయ భూమి పరిరక్షణ సమితి నాయకులు గుంటి శ్రీనివాస్, కందికొండ రాజు, కురిమిండ్ల సదానందంతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీలకతీతంగా ప్రజలు, హనుమాన్ భక్తులకు అండగా హనుమాన్ దేవాలయ భూముల కోసం పోరాడతామన్నారు. కోర్టు కేసులు పరిశీలించకుండా సృష్టించిన తప్పుడు పత్రాలపై బిల్డింగ్ నిర్మాణ అనుమతి ఇచ్చారని వెంటనే నిర్మాణ అనుమతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భక్తులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రావు పద్మ

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా 'కోరబోయిన'

హన్మకొండ: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కోరబోయిన సాంబయ్యను నియమించారు. బీజేపీలో చురుకుగా పని చేస్తున్న హనుమకొండకు చెందిన సాంబయ్యను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సాంబయ్య కొనసాగుతున్నారు. సాంబయ్య మాట్లాడుతూ తనను ఈ పదవిలో నియమించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్, సహకరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బంగారు శృతి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు రావు పద్మ, జిల్లా ఇన్‌చార్జ్ మురళీధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, మార్తినేని ధర్మారావుకు కృతజ్ఞతలు తెలిపారు.



'జనసేన' తూర్పు ఇన్‌చార్జ్‌గా బాలుగౌడ్

ఖిలా వరంగల్: జనసేన పార్టీ వరంగల్ తూర్పు ఇన్‌చార్జ్‌గా వరంగల్ శివనగర్‌కు చెందిన ఉమ్మడి జిల్లా పవన్ కల్యాణ్ అభిమాన సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి బాలుగౌడ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో మంగళవారం జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, తెలంగాణ ఇన్‌చార్జ్ శంకర్ గౌడ్ చే తుల మీదుగా బాలుగౌడ్ నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు బాలు గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'పశ్చిమ' ఇన్‌చార్జ్‌గా వంశీకృష్ణ

కాజీపేట: జనసేన పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కాజీపేటకు చెందిన బైరి వంశీకృష్ణను పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నియమించారు. ఈ మేరకు మంగళగిరి కేంద్ర పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉత్తర్వులను అందజేశారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తుందని వంశీకృష్ణ తెలిపారు.